క్లుప్తంగా

విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సతీశ్

కెరమెరి: విద్యాసంస్థల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సతీశ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌టీఏను రద్దు చేయాలని, నీట్, యూజీసీ, నెట్, సీఎస్ఐఆర్‌లలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. నాయకులు రాజేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని దహెగాం మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను నిర్మించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గందే వెంకటేశ్ కోరారు. బస్‌షెల్టర్‌ని నిర్మించాలని గురువారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బస్సుల కోసం వేచి చూసే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పెంచికల్‌పేట్ నుంచి దహెగాం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంపాల శ్రీనివాస్, ముడిమడుగుల తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న బియ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలం లోని గంగాపూర్‌లో అనిశెట్టి మహేశ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్‌లో ఓ ఇంట్లో రేషన్‌బియ్యం నిల్వ ఉంచి తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పక్కా సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించామని తెలిపారు. మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేతిపంపు ఏర్పాటు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సౌకర్యాల కోసం చేతిపంపు ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం మండలంలో ఇప్పల్ నవెగాం గ్రామంలో పోచ్చమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన నూతన చేతిపంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచ్చమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు నీటి సమస్యను గుర్తించి చేతి పంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సతీష్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా పెద్దన్న

దహెగాం: ఎంపీపీల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మండల ప్రత్యేకాధికారులను నియమించింది. దహెగాం మండల ప్రత్యేకాధికారిగా ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్నను నియమించింది. దీంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

సన్మానం

జైనూర్: ప్రజలు ఆశీర్వదిస్తే పదవులు ఏవైనా సాధించవచ్చునని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయం అధికారుల ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ కుమ్రం తిరుమల, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్రం భగవంత్‌రావు, ఎంపీటీసీలు బొజ్జుపటేల్, జుగదిరావులను శాలువాతో సన్మానించారు.

అసంపూర్తిగా వసతి భవనాలు

- ఏళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లు
- చేరేందుకు ముందుకు రాని విద్యార్థులు
- పలుచోట్ల పగుళ్లు తేలి శిథిలావస్థకు..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


అసంపూర్తిగా భవనం

బెజ్జూర్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి కల్పించేందుకు ప్రభుత్వం గత పదేళ్ల క్రితం మండల కేంద్రంలో బీసీ బాలురు, బాలికల వసతిగృహ నిర్మాణాలను ప్రారంభించింది. అయితే అప్పట్లో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. భవనాలు అసంపూర్తిగా ఉండడంతో రాత్రి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అద్దె భవనాల్లో వసతి గృహాలు..

వసతి గృహాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ప్రస్తుతం అరకొర వసతులతో అద్దె గృహాలు కొనసాగాయి. దీంతో ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం పక్కా భవనాల నిర్మాణం కోసం 2008 సంవత్సరంలో నిధులు మంజూరు చేసింది. అప్పటి రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి పడాల భూమన్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా భవన నిర్మాణాల కోసం భూమి పూజ కూడా చేశారు. అనంతరం భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు నిధుల లేమితో నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపేశారు. అనంతరం మళ్లీ నిధులు మంజూరు చేయడంతో మరో కాంట్రాక్టర్ గోడల వరకు పనులు పూర్తిచేసి నిధులు లేని కారణంగా మళ్లీ నిర్మాణ పనులు నిలిపివేశారు. తదనంతరం మూడోసారి బాలికల వసతి గృహంలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగింది. అలాగే బాలుర వసతి గృహంలో సైతం కాంట్రాక్టర్ గోడల వరకు పనులు చేసి నిలిపివేశారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం దాదాపు రూ.50లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడం గమనార్హం. రెండు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.కోటి నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. ఇదిలా ఉండగా.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాల్లో అసౌకర్యాల కారణంగా విద్యార్థులు చేరేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వసతి గృహాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.

పగుళ్లు తేలుతున్న వైనం..

విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన వసతి గృహాలు అసంపూర్తిగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి ప్రారంభానికి ముందే పగుళ్లు తేలి శిథిలావస్థకు చేరాయి. అసంపూర్తిగా ఉన్న భవనాల్లో యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. మద్యం సేవించడం, సిగరేట్లు, ఇతర మత్తు పదార్థాలతో పాటు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అవసరాలకు భవన నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వ స్థలాలు దొరకని పరిస్థితులు ఉండగా.. ఉన్న స్థలాలు, నిర్మించిన భవనాలను వినియోగించుకోక పోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. వీటి నిర్మాణాలను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం


పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గ సభ్యులను గురువారం అధికారులు సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, జెడ్పీటీసీ సముద్రాల సరిత మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మండలంలో ప్రజాప్రతినిధులుగా ఎంపికై అధికారుల సహకారంతో ప్రజలకు సేవ చేశామన్నారు. పదవీ లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామన్నారు. అంతకు ముందు అధికారులు, స్థానిక నాయకులు ఎంపీటీసీలు రాజన్న, కమల, కోఆప్షన్ సభ్యుడు సాజిత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో గంగాసింగ్, ఆర్ఐ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్ల తొలగింపు


జేసీబీతో రాళ్లను తొలగిస్తున్న అధికారులు

కై లాస్‌నగర్: మావల మండలం బట్టిసావర్గాం పరిధిలోని రాజీవ్ స్వగృహ అగ్రజా టౌన్‌షిప్ సమీపంలోని లేఅవుట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేసినట్లుగా గుర్తించిన ఆయన దానిపై చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో గురువారం బల్దియా సిబ్బంది లేఅవుట్‌ను సందర్శించారు. డీటీసీపీ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పాతిన హద్దురాళ్లను జేసీబీతో తొలగించారు. అక్రమ లేఅవుట్‌లను ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీపీవో పేర్కొన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రణాళిక విభాగం సిబ్బంది వినయ్, ఊశన్న, తదితరులు పాల్గొన్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

- విద్యసంస్థల బంద్ విజయవంతం


పాఠశాల బంద్ చేయిస్తున్న నాయకులు


నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

తిర్యాణి: నీట్ ప్రవేశపరీక్షలో అవకతవకలు జరిగాయని నీట్ మళ్లీ నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ.. గురువారం విద్యాసంస్థల బంద్ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన పలు పాఠశాలలకు వెళ్లి బంద్ చేయించారు. సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టడంతో పాటు కేంద్ర విద్యశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. నీట్ పరీక్షకు హాజరైన ప్రతీ అభ్యర్థికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

కౌటాల: విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయినాథ్ తెలిపారు. ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కౌటాల మండలంలో విద్యాసంస్థల బంద్ పాటించారు. నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలన్నారు. నాయకులు శశి, ఉమేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు కొండా సాయికుమార్ మాట్లాడుతూ జాతీయ పరీక్షల సమగ్రతను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బంద్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నిఖిల్, కోదురుపాక మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: నీట్ పరీక్షను రద్దు చేయడంతో పాటు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలల బంద్‌కు పిలుపునివ్వడంతో మండలంలోని పాఠశాలలు మూతపడ్డాయి. నాయకుడు నవీన్ మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- వృథాగా పరికరాలు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



ధనోరాలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

కెరమెరి: యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణాల్లో, ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో వసతులు నిరుపయోగంగా మారాయి. గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. కొన్ని చోట్ల క్రీడా మైదానాలు బోర్డులకే పరిమితమయ్యాయి. పలుచోట్ల వాహనాలు, యంత్రాలను నిలిపేందుకు వినియోగిస్తున్నారు.

ఊరికి దూరంగా ఏర్పాటు..

మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 93 క్రీడా ప్రాంగణాలు మంజూరయ్యాయి. వీటి ఉపయోగానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో క్రీడా సామగ్రిని మంజూరు చేసింది. అందులో క్రికెట్ కిట్లు 94, వాలీబాల్ 94, సైకిల్ పంప్ 94, డంబుల్ 94, టేనిక్వైట్స్(రింగ్స్) 94, స్కిప్పింగ్ రోప్ 94, ప్లాస్టిక్ విజిల్ 94, టీషర్టులు 7050 మంజూరయ్యాయి. అందులో ఒక్క క్రికెట్ కిట్టు ఖరీదు రూ.50 వేలు ఉండడం గమనార్హం. మండలంలోని 115 గ్రామాల్లో 2136 మంది క్రీడాకారులు ఉన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి 3 కిట్లను ఇచ్చారు. ఒక్కో చోట మైదానం ఏర్పాటుకు సుమారు రూ. 75 వేలు ఖర్చు చేసినట్లు అంచనా. చాలా చోట్ల ఊరికి దూరంగా ఉండడంతో మైదానాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. ఇంత మంది క్రీడాకారులు ఉన్నప్పటికీ ఎవరూ కూడా ఆయా క్రీడాప్రాంగణాల్లో ఆటలు ఆడడం లేదు.

కానరాని పరికరాలు..

గతంలో ఉన్న ప్రభుత్వం క్రీడాకారులు ఆడేందుకు పలు రకాల కిట్లను అందించినప్పటికీ అవి ఎక్కడున్నాయి ఎవరికి తెలియదు. దీంతో ఆ పరికరాలు కనిపించకుండా పోయాయి. తీసుకున్న వారు సైతం 10 శాతం శాతం క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడలేదని తెలుస్తోంది. దీనికి కారణం అనువైన స్థలం లేకపోవడంతో ఊరికి దూరం ఉండడం కూడా మరో కారణం. ఇప్పటికైనా అధికారులు వసతులు కల్పించి యువతకు చేయుతనివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



క్రీడా ప్రాంగణాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. క్రీడాకారులకు అన్నివిధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలో క్రీడాకారులకు వివిధ రకాల కిట్లను అందించడం జరిగింది. అవి ఎక్కడున్నాయో తెలుసుకుని వానాకాలం సీజన్ ముగియగానే క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువస్తాం.
– ఎండీ అంజద్ పాషా, ఎంపీడీవో, కెరమెరి

బొగ్గుబ్లాకులు సింగరేణికే కేటాయించాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులు సింగరేణి సంస్థకే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గోలేటిటౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం నరేందర్‌కు వినతిపత్రం అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ మైనింగ్ పేరుతో బొగ్గు బ్లాకులను వేలం వేస్తూ ప్రైవేటుకు అప్పగిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి బొగ్గు బ్లాకులు నేరుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శులు మాధవకృష్ణ, చంద్రకుమార్, శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకులు సంజీవరెడ్డి, సదాశివ్, పిట్ కార్యదర్శులు, ఏరియా నాయకులు శ్రీకాంత్, వెంకటేశ్, తిరుపతి, స్వామి, యాదగిరి, భీమేశ్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళల మార్కెటింగ్‌కు సహకరిస్తాం


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కెరమెరి: హస్తకళల మార్కెటింగ్‌కు సహకరిస్తామని ఎంఎస్ఎంఈ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కేస్లాగూడ గ్రామంలో గురువారం పర్యటించారు. వివిధ కళాకృతులను పరిశీలించారు. రానున్న కాలంలో హస్త కళాకారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ ప్రతినిధులు రాంచంద్రారావు, లక్ష్మణ్, ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఇంద్రవెల్లి: రైతుభరోసాపై రైతులు అందించిన సలహాలు, సూచనలు, అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె అన్నా రు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. పది ఎకరాల లోపు వ్యవసాయ భూమికి మాత్రమే రైతుభరోసా ఇవ్వాలన్నారు.

‘కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి సరికాదు’


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు గనుల వేలం విషయంలో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా నామినేషన్ విధానంలో ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు వేలం ద్వారా కట్టబెడితే సింగరేణికి భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఎంఎండీఆర్ చట్టం ద్వారా నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకు గనులు కేటాయించాలని ఈ నెల 5న కలెక్టరేట్‌ల ముట్టడి చేపడతామని, 8 నుంచి 12 వరకు అన్ని జీఎం కార్యాలయ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. అలాగే 17న హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు, సింగరేణి కార్మికులు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, నాయకులు రమేశ్, సురేశ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

మెట్లగూడకు బస్సు బంద్

- కర్జిలోనే నైట్ హాల్ట్



దహెగాం: వర్షాకాలం నేపథ్యంలో దహెగాం మండలంలోని మూరుమూల గ్రామం మెట్లగూడకు రెండు వారాలుగా ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిచిపోయింది. సాధారణంగా వేసవితోపాటు చలికాలంలో మంచిర్యాల డిపోకు చెందిన బస్సు మొట్లగూడ వరకు నడుపుతారు. ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు దహెగాం వరకు వచ్చి మొట్లగూడకు రాత్రి పది గంటలకు చేరుకునేది. రాత్రి అక్కడే నైట్‌హాల్ట్ ఉంచి తర్వాతి రోజు ఉదయం మంచిర్యాలకు బయలుదేరేది. అయితే రెండు వారాలుగా కర్జి వరకు మాత్రమే బస్సు సర్వీసు కొనసాగుతోంది. అక్కడే నైట్‌హాల్ట్ ఉంచి ఉదయం మళ్లీ మంచిర్యాలకు నడుపుతున్నారు. మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు 15 కిలోమీటర్ల దూరం ప్రైవేట్ వాహనాల్లో కర్జి వరకు ప్రయాణించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి మొట్లగూడకు ఆర్టీసీ బస్సులు కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేశీదారు పట్టివేత


దేశీదారు మద్యంతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్‌కు చెందిన బండారి రాజశేఖర్ గురువారం రాత్రి వాంకిడి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీ చేశామన్నారు. అతడి బ్యాగులో 100 దేశీదారు మద్యం 90 ఎంఎల్ సీసాలు లభ్యమైనట్లు తెలిపారు. మద్యం విలువ రూ.4 వేలు ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన టిప్పర్


నిలిచిపోయిన టిప్పర్

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గూడెం అటవీ మార్గంలో కంకర తరలిస్తున్న టిప్పర్ లారీ నిలిచిపోవడంతో గురువారం రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కౌటాల మండలంలోని ముత్తంపేట కంకర క్రషర్ నుంచి మహారాష్ట్రకు కంకర తరలిస్తున్న టిప్పర్ లారీ ఖర్జెల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిలిచిపోయింది. గురువారం తెల్లవారుఝామున 2గంటల సమయంలో డీజిల్ అయిపోవడంతో నడిరోడ్డుపై ఆగిపోవడంతో ఇరువైపులా వాహనాలు నిచిపోయాయి. దీంతో లారీ డ్రైవర్‌తో ప్రజలు వాగ్వాదానికి దిగారు. అనంతరం లారీకి మరమ్మతులు చేసి రహదారిపై నుంచి తొలగించారు.